క్లుప్తంగా

సుల్తాన్‌పూర్‌తండాలో తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో గిరిజన యువతులు తీజ్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు నియమనిష్టలతో పెంచిన గోధుమ నారును తండాలోని కూడలి వద్దకు చేర్చారు. అనంతరం పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువతులు పాల్గొన్నారు.

క్రాంతికుమార్‌కు సేవా రంగ అవార్డు



క్రాంతికుమార్‌కు అవార్డు అందజేస్తున్న డాక్టర్ ఆలూరి విల్సన్

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన సుంకరి క్రాంతికుమార్ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఆలూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ సేవా రంగ అవార్డును ప్రదానం చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్ చేతుల మీదుగా క్రాంతికుమార్ అవార్డు అందుకున్నారు. క్రాంతికుమార్‌కు అవార్డు రావడం పట్ల నేరేడుచర్లకు చెందిన పలువురు అభినందించారు.

ఎర్రవరం ఆలయానికి దేవాదాయ శాఖ నోటీసులు

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకొనుటకు గాను బుధవారం నోటీసులు పంపింది. ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన నూరేపల్లి హుస్సేన్ గత నెల 18న నల్లగొండ దేవాదాయ–ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో తెలిపాడు. దీనిపై స్పందించిన వారు ఆలయాన్ని స్వాధీనం చేసుకొని ఆలయ నిర్వహణ చేపడుతామని తెలుపుతూ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఏమైన అభ్యంతాలు ఉంటే పదిహేను రోజుల్లో లిఖితపూర్వకంగా తెలపాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే దేవాదాయ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నోటీసును ఆలయం వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయం, రెవెన్యూ, పోలీస్, మండలాభివృద్ధి కార్యాలయాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ జయశ్రీకి సన్మానం



జయశ్రీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో గత మూడున్నరేళ్లుగా తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న వజ్రాల జయశ్రీని బుధవారం జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, సర్పంచ్‌లు షేక్ సలీమా, గుజ్జుల సుజాత, అన్నెం శిరీష, గుండెపంగు సౌజన్య, కీత జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బుధవారం పట్టణంలోని గోవిందపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సౌజన్య ధనుంజయ్, బి.రాజు, బి.భాస్కర్, పి.రాజు, జె.ప్రసాద్, కోటి, వీరబాబు, దీవెనకుమార్, అనిల్, పోతుల జ్ఞానయ్య, పెద్ద లక్ష్మీనర్సు, వీరబాబు, వేణు, దశరథ, రాము, అబ్రహం పాల్గొన్నారు.

మాణిక్యంచారి మృతి బాధాకరం

గరిడేపల్లి : సీపీఎం సీనియర్ నేత మాణిక్యం చారి అకాల మృతి బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కీతవారిగూడెంలో మాణిక్యం చారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్, తుమ్మల సైదయ్య, శ్రీనివాస్, పటాన్, మహబుబ్‌అలీ, భిక్షం, శ్రీనివాస్, వెంకటయ్య ఉన్నారు.

ఏపుగా వరినార్లు.. ఆందోళనలో రైతులు

- టేలాండ్‌లో పదివేల ఎకరాల్లో సాగుకు సన్నద్ధం
- నార్లు పోసుకొని సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న కర్షకులు
- బోర్లు, బావుల మోటార్లకు నిరంతర విద్యుత్ అందించాలని వేడుకోలు



కొత్తతండా సమీపంలో పెరుగుతున్న వరినారు

మఠంపల్లి : మండలంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాలువల పరిధిలోని చివరి ఆయకట్టు (టేలాండ్) రైతులు వానాకాలం సాగుకు నార్లు పెంచుతున్నారు. ముందస్తుగా కురుసిన వర్షాలతో పాటు బోర్లు, బావుల ఆధారంగా పోసిన నారు ఏపుగా పెరుగుతోంది. అయితే మట్టపల్లి మేజర్ కాల్వ పరిధితో పాటు బోర్లు, బావుల ఆధారంగా సుమారు 7వేల 200ల ఎకరాలకు, గుండ్లపల్లి మేజర్ పరిధితో పాటు బోర్లు, బావుల ఆధారంగా మరో 3 వేల 400ల ఎకరాలలో నాట్లు వేసేందుకు నారు పెంచుతున్నారు. గత ఏడాది ముందస్తుగా సాగునీరు విడుదల చేయడంతో పాటు సమృద్ధిగా వర్షాలు కురవడంతో వానాకాలం, ఎండాకాలం పంటలు సకాలంలో చేతికందాయి. దీంతో ఆయకట్టు, చివరి ఆయకట్టు రైతులు ఈ ఏడాది కూడా కాలం కలిసి వస్తుందని ఆశతో కాస్త ముందస్తుగా వరినార్లు పోశారు. అవి కాస్త నాటువేసే దశకు చేరుకున్నాయి. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నారు పెంపకానికి ఇబ్బంది లేదు. కానీ సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తుండడంతో టేలాండ్ రైతులు సాగుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావులలోని నీరు సరిపడా సాగుకు అందే అవకాశం లేదని అంటున్నారు. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయంతో వేసిన వరి సాగుకు నీరందకుండా పోయే పరిస్థితి దాపురిస్తుందని అంటున్నారు. ప్రభుత్వం ఎడమకాలువ ద్వారా ఇప్పటికే పాలేరు రిజర్వాయర్ ప్రాంతానికి నీటిని విడుదల చేయడం జరుగుతోందని అదేవిధంగా చివరి ఆయకట్టు ప్రాంతానికి కూడా ముందస్తుగా సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే ట్రాన్స్‌కో అధికారులు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

సాగు నీరు విడుదల చేయాలి



మండలంలో ఆయకట్టు, చివరి ఆయకట్టులో ముందస్తుగా వరినార్లు పోసుకోవడంతో అవి ఏపుగా పెరుగుతున్నాయి. వరినాట్లు వేసేందుకు సరిపడా సాగర్‌నీటిని విడుదల చేయాలి

– మాలోతు సక్రునాయక్, రైతు, కాల్వపల్లితండా

విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలి



నాట్లు వేసేందుకు వరి నారు సిద్ధమైంది. ఇప్పట్లో సాగునీరందే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం బోర్లు, బావులలో ఉన్న నీటి ద్వారా నాట్లు వేసేందుకు అధికారులు విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా సరఫరా చేయాలి

– బానోతు బాలానాయక్, రైతు, కొత్తతండా

వాహనాల వేగ నియంత్రణపై దృష్టి సారించాలి

- కోదాడ డీఎస్పీ ప్రకాశ్ యాదవ్



గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ ప్రకాశ్ యాదవ్

గరిడేపల్లి : కోదాడ – జడ్చర్ల హైవే కావడంతో వాహనాల రద్దీ మరింత పెరిగిందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనాల వేగ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోదాడ డీఎస్పీ ప్రకాశ్‌యాదవ్ సూచించారు. బుధవారం రాత్రి గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వసతులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గరిడేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో హైవేపై కొంత ఇరుకుగా ఉందని కావున ఆర్టీసీ బస్సులను ఇక్కడ కాకుండా గరిడేపల్లి బస్టాండ్‌లో నిలుపుదల చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రోడ్లపై ఇష్టం వచ్చినట్లు ద్విచక్రవాహనాలు నిలుపవద్దని, వాహనాలు రోడ్లపై నిలిపితే వారికి జరిమానా విధిస్తామన్నారు. ఆర్టీసీ బస్సును రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆపకుండా ప్రయాణికులు బస్టాండ్ లోనే ఎక్కి, బస్టాండ్‌లో దిగాలని కోరారు. ఆర్టీసీ బస్సులను బస్టాండ్‌లోనే నిలిపే విధంగా కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ డిపో మేనేజర్లకు లేఖ పంపించాలని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకుల పరీక్షలను ఒకే కేంద్రంలో నిర్వహించాలి

మఠంపల్లి : గురుకుల విద్యాలయాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, లైబ్రేరియన్ల పోస్టులకు నిర్వహించే పరీక్షను ఒకే కేంద్రంలో ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పరీక్ష కేంద్రాలను మల్టీ పర్పస్ విధానంలో ఏర్పాటు చేస్తే అభ్యర్థులు తీవ్రంగా నష్ట పోయే అవకాశం ఉందన్నారు. ఏ జిల్లా అభ్యర్థులు ఆ జిల్లాలోనే పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘం నాయకులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ప్రమీల



నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ డాక్టర్ ప్రమీల, కార్యవర్గ సభ్యులు

కోదాడరూరల్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోదాడ డివిజన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం కోదాడలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 130 సభ్యులున్న ఈ సొసైటీలో 100 మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరు కాగా 12 మందిని మెంబర్ లుగా ముగ్గురిని అఫీషియో సభ్యులుగా ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా డాక్టర్ కాకుమాను ప్రమీల శ్రీపతిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా పబ్బా గీత, ట్రెజరర్‌గా తూమాటి సురేష్‌రెడ్డిలను, అఫీషియో సభ్యులుగా మల్లెల వెంకట సుబ్బారావు, జగిని ప్రసాద్, జయవరపు నరేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ డాక్టర్ ప్రమీల మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ దేవకరుణ, నడిగూడెం తహసీల్దార్ నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్వేత, డీటీ సంధ్యారాణి, ఆర్‌ఐ వెంకటనగేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ శ్రీపతిరెడ్డి, డాక్టర్ బ్రహ్మం, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

మఠంపల్లి : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చౌటపల్లి సమీపంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటపల్లికి చెందిన కోనేటి నాగేంద్రబాబు, క్రిష్ణవేణి దంపతులు బైక్‌పై గ్రామం నుంచి మఠంపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని క్రాస్ చేసి వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ బైక్‌కు తగలడంతో బైక్‌తో సహా ఇరువురు భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. దీంతో ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రైవేటు వాహనంలో హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి నాగేంద్రబాబును మెరుగైన చికిత్స కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. పోలీసులు సమాచారం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకొని లారీని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

'తొలిమెట్టు' విద్యార్థుల భవిష్యత్తుకు నాంది



కోదాడఅర్బన్ : తొలిమెట్టు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ షరీఫ్



మఠంపల్లి : ఉపాధ్యాయులకు వర్క్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ ఛత్రునాయక్

కోదాడఅర్బన్ : తొలిమెట్టు కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు నాంది కావాలని ఎంఈఓ ఎండి సలీం షరీఫ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాలలో కోదాడ, అనంతగిరి మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తెలుగు సబ్జెక్టు శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో రాయడం, చదవడం, చతుర్విధ ప్రక్రియలు రావడం లేదని పలు జాతీయ సర్వేలు చెబుతున్నాయని విద్యార్థుల్లో ఈ సామర్థ్యాలు పెంపొందించడానికి రాష్ట్ర విద్యా శాఖ తొలిమెట్టు అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. మూడు దఫాలుగా ఆగస్టు 2 నుంచి 8వ తేదీ వరకు జరిగే తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారులు తల్లాడ శ్రీనివాసరావు, ఉస్కుల రామారావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె.సుజాత, రాజు, రిసోర్స్ పర్సన్‌లు ఎండీ హమీద్, రమేష్, ఎస్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, మధన్‌మోహన్, జయంత్, సీఆర్పీలు వెంకటరమణ, సుజాత, హైమవతి, సీతారాం, శ్రీనివాసరావు, ఎంఎస్ కోఆర్డినేటర్‌లు శ్రీనివాస్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణను వినియోగించుకోవాలి

మఠంపల్లి : విద్యార్థులలో మౌలిక భాషా గణిత సామర్థ్యాల పెంపు ఆవశ్యకతను వివరిస్తూ ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు వినియోగించుకుని అవగాహనతో పాటు సమయపాలన పాటించాలని ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పాఠ్య ప్రణాళికలు, విద్యార్థుల కోసం అభ్యాస దీపికలు (వర్క్‌బుక్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రామిశెట్టి వేణుగోపాల్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కీత శ్రీనివాసరావు, ఇంజమూరి చిరంజీవి, ఉమ్మాల రామకృష్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు బూర సైదయ్యగౌడ్, ఎంఆర్‌టీలు అనిల్‌కుమార్, బ్రహ్మారెడ్డి, కేఆర్‌పీలు జోహన్నస్, రాజు, కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠాలు సులభ పద్ధతిలో బోధించాలి

చిలుకూరు : ఉపాధ్యాయులు శిక్షణకు అనుగుణంగా విద్యార్థులకు పాఠాలు సులభ పద్ధతిలో పాఠాలు బోధించాలని కాంప్లెక్స్ చైర్మన్, జీహెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిలుకూరు ఎంఈఓ కార్యాలయంలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు నూతనంగా వచ్చిన హ్యాండ్ బుక్స్‌పై జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బేతవోలు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం తేజోరాం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ క్షమాపణ చెప్పాలి

నడిగూడెం : దేశ మహిళలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన డిమాండ్ చేశారు. బుధవారం నడిగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని ఆరోపించారు. తక్షణమే నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి సాతులూరి అలివేలు, జిల్లా కౌన్సిల్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిక్షనరీల పంపిణీ

మఠంపల్లి : బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ ఫౌండేషన్ డేను పురస్కరించుకుని మండలంలోని చౌటపల్లిలో గల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ భూక్యా మోతీలాల్ బుధవారం డిక్షనరీలు స్థానికంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలి

హుజూర్‌నగర్ : జర్నలిస్టు పేరుతో బీఆర్‌ఎస్ పార్టీపై, ఎమ్మెల్యే సైదిరెడ్డిపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని బీఆర్‌ఎస్ యూత్ నాయకులు అన్నారు. జర్నలిస్ట్ పేరుతో అసత్యాలను ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణ యూత్ అధ్యక్షుడు సోమగాని ప్రదీప్, నాయకులు ములకలపల్లి రాంబాబు, వెంకన్న, నాగరాజు, వికాస్, సయీద్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, వినయ్, అఖిల్ , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఓజో' చేయూత

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో నిరుపేద దళితుడు చెడపంగు వీరనర్సింహ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు రూ.5వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని ఓజో ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న ద్వారా బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఓజో సభ్యులు గోపి, సుధాకర్, సాయిబాబా, రవినాయక్, రాజునాయక్, సైదులు ముదిరాజ్, చారి, జిలానీ, వినయ్, సాయి, సైదులు, ఉన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి దీప్లానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సైదానాయక్, ఎల్.శ్రీనివాస్, ప్రసాద్, వెంకన్న, శ్రీనివాస్, సైదులు, పద్మావతి, సత్యనారాయణతదితరులు ఉన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



నేరేడుచర్లలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు



మునగాలలో జ్యోతి ప్రజ్వలన చేసి తల్లిపాల వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బిందు



గరిడేపల్లి : తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ వనజ తదితరులు

కోదాడఅర్బన్ : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం అని ఎంపీపీ చింతా కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని సంఘ మిత్ర భవన్‌లో కోదాడ మండల ఎస్‌హెచ్‌జీ, వీవోఏ గ్రూప్‌ల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి గంటలోనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు, తల్లికి ప్రయోజనమన్నారు. సీడీపీఓ కె. పారిజాత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ, సీసీలు కవిత, లావణ్య, పోషణ అభియాన్ సిబ్బంది ఫరీదుద్దీన్, వీరయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : తల్లిపాలే బిడ్డలకు ఆరోగ్యం అని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని స్త్రీ సంక్షేమ భవన్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ విజయశ్రీ, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

చిలుకూరు : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వీబీకేలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండుయాదవ్, సూపర్‌వైజర్లు సునిత, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మునగాల : బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జ్యోతిప్రజ్వలన చేసి తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. శిశువు జన్మించగానే ముర్రుపాలు పట్టించడంతో ఎన్నో రకాల విటమిన్లు అందుతాయని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఉప్పుల రజిత, కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి సునిత, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, మాణిక్యం, ఎల్లమ్మ, రూప, మణి, కమల, ఆయాలు, సమభావన సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

మఠంపల్లి : తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రతినిత్యం గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వసంత, లక్ష్మి, నిర్మల, కార్యదర్శులు, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు, వీఓఏలు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాంతకుమారి, ఎంపీఓ లావణ్య, సీడీపీఓ విజయలక్ష్మి, సీహెచ్‌ఓ పద్మ, ఏపీఎం సౌజన్య, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

గరిడేపల్లి : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఎంపీడీఓ వనజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, వైద్యాధికారి శృతి, ఎంపీటీసీ కడియం స్వప్న వెంకట్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, మల్లేశ్వరి, సీసీ సుజాత వైద్య సిబ్బంది ఉన్నారు.

గరిడేపల్లి : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా లభిస్తుందని, ప్రతి తల్లి ఆరునెలల పాటు బిడ్డకు తల్లిపాలు అందించాలని అంగన్‌వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. బుధవారం మండలంలోని గానుగుబండలో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అమరారపు సత్యావతి, గోవిందమ్మ, ఆశా వర్కర్లు శివమ్మ, సైదమ్మ, ఫిరాంబీ, నవ్య, ఇందు, గౌసియా, మనిషా, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

హుజూర్‌నగర్ : తల్లిపాలు అమృతంతో సమానం అని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని వాటిలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ వెంకటేశ్వర్లు, సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ సోమమ్మ, వైద్య, మెప్మా, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల : పట్టణంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ అశోక్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు సిబ్బంది ఉన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

నడిగూడెం : పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సంఘ బంధాల అధ్యక్షులు, వెలుగు సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, డాక్టర్.హరినాథ్, ఎంపీఓ యర్ర.లింగారెడ్డి, ఏపీఎం రామలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో శ్మశాన వాటిక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు మంజీనాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాల నుంచి వడ్డెరలు, మున్నూరు కాపులు, పద్మశాలీలు, వైశ్యులు వినియోగించే శ్మశాన వాటికను కొందరు ఆక్రమిస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకుని శ్మశాన వాటికకు హద్దులు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాస్, యాదగిరి, కోటయ్య, వెంకటనారాయణ, బాబు, బాలశౌరి, రమేష్, బాలకృష్ణ, చెన్నయ్య, రాజేష్, మహేష్, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్.లక్ష్మీప్రసన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో కళ్లు ఎర్రగా కావడం, కళ్లల్లోంచి నీరు కారడం జరుగుతుందన్నారు. ఇది కళ్ల కలక వ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందని, దానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. లక్షణాలు కన్పిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి, డాక్టర్.హరినాథ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ పరమేష్‌కు సన్మానం

నేరేడుచర్ల : నూతన ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌ను సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సింహాద్రి, నాయకులు రావుల సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను, వెంకన్న, ఎస్‌కె మధార్ ఉన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

నేరేడుచర్ల : మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అల్లర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కన్వీనర్ వాస పల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కోదాడ– జడ్చర్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మతోన్మాదం పెరిగి మైనార్టీలు, దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సయ్యద్ హుస్సేన్, కరుణాకర్, మరియమ్మ, పావని, సత్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలోని పశువైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ రవినాయక్ బుధవారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నడిగూడెం : ప్రస్తుతం వానాకాలంలో మూగజీవాలకు వివిధ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, దీంతో మూడవ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారిణి డాక్టర్ బి.అఖిల బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మేళ్లచెరువులో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, కార్మికులు

మేళ్లచెరువు : తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 28వ రోజు కొనసాగింది. సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ఆధ్వర్యంలో మేళ్లచెరువులో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాలు, వట్టిపు సైదులు, వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నేత పందిరి నాగిరెడ్డి అన్నారు. బుధవారం కోదాడలో కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. లింగయ్య, ముత్తయ్య, కరీం ఉన్నారు.

మఠంపల్లి : పంచాయతీ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించి కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్మియా కోరారు. బుధవారం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇంటి రవి, మైసయ్య, మోతీలాల్ నాయక్, దేవదానం, రహీం, గురవారెడ్డి ఉన్నారు.

గరిడేపల్లి : గరిడేపల్లిలో పంచాయతీకార్మికులు చేపట్టిన సమ్మెకు బుధవారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల పార్టీ కార్యదర్శి యాకుబ్, గోపగాని సత్యం, కొండ సైదులు, రమేష్, రాజు ఉన్నారు.